సాక్షి నల్లగొండ

శనివారం । 22 । జూలై । 2023



నాలుగు గేట్ల ద్వారా విడుదల

మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో నాలుగు క్రస్టు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు.

- 8లో



యాదాద్రికి వరుణుడి ఎఫెక్ట్

వర్షాల కారణంగా యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తుల రాక తగ్గడంతో ఆదాయం పడిపోయింది.

- 10లో

గరిష్టం/కనిష్టం

30°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యాసంస్థలకు నేడు సెలవు

నల్లగొండ : రాష్ట్రంలో నాలుగు రోజులుగా మోస్తారు నుంచి భారీ వర్షాలు కురస్తుండడంతో విద్యాశాఖ శనివారం కూడా రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను జిల్లాలోని విద్యాసంస్థలు పాటించాలని పేర్కొన్నారు.

18.5 మిల్లీమీటర్ల సగటు వర్షం

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 18.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. చిట్యాల మండలంలో 28.6 మిల్లీమీటర్లు, నార్కట్‌పల్లి 20.8, కట్టంగూరు 12.4, శాలిగౌరారం 49.0, నకిరేకల్ 38.8, కేతేపల్లి 46.8, తిప్పర్తి 5.8, నల్లగొండ 6.4, కనగల్ 23.4, మునుగోడు 11.6, చండూరు 25.6, మర్రిగూడ, 22.6, చింతపల్లి 34.6, నాంపల్లి 22.8, గుర్రంపోడు 23.4, అనుముల హాలియా 32.2, నిడమనూరు 27.0, త్రిపురారం 12.4, మాడుగులపల్లి 5.0, వేములపల్లి 5.0, మిర్యాలగూడ 3.3, దామరచర్ల 32.2, అడవిదేవులపల్లి 21.6, తిరుమలగిరిసాగర్ 13.2, పెద్దవూర 8.2, పీఏపల్లి 4.4, నేరెడుగొమ్ము 3.8, కొండమల్లేపల్లి 5.6, దేవరకొండ 7.4, గుండ్లపల్లి 13.2, చందంపేట మండలంలో 7.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ



కమిషనర్ పూర్ణచందర్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్‌గా పూర్ణచందర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి బదిలీ కాగా ప్రస్తుతం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ గ్రేడ్-1 మున్సిపాలిటీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, పాలక మండలి సహకారంతో పట్టణ అభివృద్ధి తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకుముందు కమిషనర్‌కు కార్యాలయ ఉద్యోగ, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

కార్గో సేవలను వినియోగించుకోవాలి



కార్గో సేవలను ప్రారంభిస్తున్న అధికారులు

పెద్దవూర : టీఎస్ ఆర్‌టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జి.శ్యాం కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలో టీఎస్ ఆర్‌టీసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్గో సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా కార్గో సేవలు అందుటుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట దేవరకొండ డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ మణిపాల్‌నాయక్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.హరిలాల్, మట్టపల్లి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : బీసీ సంక్షేమ, ఉద్యోగ, యువజన, మహిళ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 6న నల్లగొండ పట్టణంలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న బీసీల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సంఘం నాయకులు శుక్రవారం నల్లగొండలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, పర్వతాలు, రమణ ముదిరాజ్, వంగూరి నారాయణయాదవ్, మునాస ప్రసన్నకుమార్, మేకల యాదన్న, అల్లి వేణు, వెంకటేశ్వర్లు, భవానిప్రసాద్, శ్రీనివాస్, దూదిగామ స్వామి, లక్ష్మణాచారి, యాదగిరి, సైదులు, వెంకన్న, ఫనిత్, గిరి, ప్రదీప్, లలిత తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ సీట్ల కేటాయింపు



డ్రా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రైవేట్ పాఠశాలల్లో సీట్ల కేటాయింపునకు శుక్రవారం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ డ్రా పద్ధతిన సీట్లు కేటాయించారు. 1వ తరగతిలో మొత్తం 134 మందికి సీట్లు ఉండగా అందులో 44 మంది బాలికలు, 90 మంది బాలురను ఎంపిక చేశారు. 5వ తరగతిలో 137 మందికి గాను 45 మంది బాలికలు, 92 మంది బాలురను ఎంపిక చేశారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, డైరెక్టర్ శ్రీనివాస్, పాలడుగు నాగార్జున, పందుల సైదులు, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన లాటరీకి హాజరైన తల్లిదండ్రులు

ఎంజీయూ పరిధిలోని పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో జరిగే డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మిర్యాల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఐఎంబీఏ, ఐపీసీ, లా, ఎంఈడీ కోర్సులకు ఈనెల 22న జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 24న జరగాల్సిన పరీక్ష యథావిధిగా జరుగుతాయని తెలిపారు. అదే విధంగా ఈనెల 22, 24న జరగాల్సిన డిగ్రీ పరీక్షలు వాయిదా వేసినట్లు తెలిపారు.

ఎన్నికలకు సన్నద్ధత

- ఓటింగ్ శాతాన్ని పెంచేలా యంత్రాంగం చర్యలు
- కలెక్టరేట్, నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎంల ప్రదర్శన కేంద్రాలు
- ప్రతి పోలింగ్ బూత్‌లో అవగాహన కల్పించేలా మొబైల్ వాహనాల ఏర్పాటు
- తుది దశకు ఓటరు జాబితా రూపకల్పన
- బీఎల్‌ఓలు, నోడల్ అధికారులకు కొనసాగుతున్న శిక్షణ



నల్లగొండ ఆర్‌డీఓ ఆఫీస్‌లో ఓటింగ్ ప్రదర్శన కేంద్రంలో ఓటు వేస్తున్న ఆర్డీఓ రవి



నకిరేకల్‌లో మొబైల్ ఓటింగ్ యంత్రం వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నల్లగొండ : వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి సేకరించిన దరఖాస్తులను, ఆన్‌లైన్‌లో వచ్చిన వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈనెల 27 వరకు ఓటు నమోదుకు అవకాశం ఉంది. ఆ తర్వాత ఈఆర్‌ఓ నెట్ బంద్ అవుతుంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఓటర్ల ముసాయిదా జాబితాను ఆగస్టు 21న ప్రదర్శించనున్నారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్‌బూత్‌లు పెరగనున్నాయి. ఎన్నికల బదిలీల ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుంది. మరోవైపు ఓటింగ్ శాతాన్ని పెంచేలా.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై (ఈవీఎం) ప్రజలకు ఉన్న సందేహాలను తొలగించేందుకు ఓటింగ్ యంత్రాల ప్రదర్శన చేపడుతున్నారు. బీఎల్‌ఓలకు శిక్షణ కొనసాగుతోంది. శుక్రవారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నోడల్ అధికారులు, నియోజకవర్గ నోడల్ అధికారులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

అపోహలను తొలగించేలా..

ఈవీఎంలపై ఉన్న అపోహలను తొలగించే ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్‌లో ఈవీఎంల ప్రదర్శన కేంద్రాన్ని గురువారం సాయంత్రం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ప్రారంభించి ఓటు వేసి చెక్ చేశారు. శుక్రవారం జిల్లాలోని 6 నియోజకవర్గ కేంద్రాల్లో కూడా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రదర్శన కేంద్రాలను ప్రారంభించారు. వీటితోపాటు 6 నియోజకవర్గాల్లో 6 మొబైల్ ఓటింగ్ యంత్ర వాహనాలను ఏర్పాటు చేశారు. ఆ వాహనాలు ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లకు వెళ్లనున్నాయి. ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటింగ్ యంత్రం ఉంచి ఏ యంత్రం ఏవిధంగా పని చేస్తుందన్న దానిపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. 2018 ఎన్నికల్లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లతోపాటు కొత్తగా వీవీ ప్యాట్లను కూడా ఏర్పాటు చేశారు. ఓటరు తాను ఏ అభ్యర్థికైతే ఓటు వేశానో.. ఆ అభ్యర్థికే పడిందా లేదా అన్నది వీవీ ప్యాట్లలో వచ్చే రశీదును బట్టి తెలుస్తుంది. ఈవీఎంలలో నమోదైన ఓట్ల లెక్కింపులో సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు వీవీ ప్యాట్లలోని ఓట్లను లెక్కించి ఫలితాలను నిర్ధారించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన ఉండాలనే ఎన్నికల సంఘం ఉద్దేశం.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నిర్వహణకు నియమించిన రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు ఎన్నికల నిబంధనలు, నిర్వహించాల్సిన పనులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, జె.శ్రీనివాస్, అదనపు ఎస్పీ కెఆర్‌కె.ప్రసాదరావుతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల పనుల నిర్వహణ నిమిత్తం నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ నిర్వహణ, మెటీరియల్ మేనేజ్‌మెంట్, రవాణా నిర్వహణ, కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ, స్వీప్, శాంతి భద్రతలు, ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్, మీడియా, కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్ట్రోరల్ రోల్స్, ఫిర్యాదుల నిర్వహణ, ఓటర్ హెల్ప్ లైన్, ఆబ్జర్వర్స్, పీడబ్ల్యూడీ ఓటర్స్, పోలింగ్ సిబ్బంది సంక్షేమం, అగ్ని ప్రమాద నివారణ, స్ట్రాంగ్ రూం, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, మెడికల్ తదితర విభాగాలకు నోడల్ అధికారులను.. వీరికి సహాయక అధికారులను నియమించినట్లు తెలిపారు. నోడల్ అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, సూచనలు ప్రకారం పూర్తి అవగాహనతో ఎన్నికల నిర్వహణలో పని చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల భర్తీకి లైన్ క్లీయర్

- సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించిన ప్రభుత్వం
- నల్లగొండ జిల్లాలో 56 మందికి మేలు



నల్లగొండ : కారుణ్య నియామక కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ ఖాళీలను పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4లోకి తీసుకోవడం, అక్కడక్కడా మిగిలిన వాటిలో ఇటీవల వీఆర్‌ఓలకు సర్దుబాటు చేశారు. దీనివల్ల డిగ్రీలు పూర్తి చేసిన వారు కారుణ్య నియమకం కింద జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగం పొందేందుకు ఖాళీలు లేక ఎదురు చూస్తున్నారు. అటెండర్ పోస్టులు ఉన్నప్పటికీ వాటిలో చేరడం ఇష్టంలేక అలాగే ఉండి పోతున్నారు. దీంతో కారుణ్య నియామకాల కింద దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్న విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో రాష్ట్ర వ్యాప్తంగా 1266 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించింది. కారుణ్య నియామకానికి సంబంధించి నల్లగొండ జిల్లాలో 56 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తుదారుల్లో డిగ్రీ పూర్తి చేసిన వారు 50 మంది వరకు ఉన్నారు. వారంతా ఇప్పుడు సూపర్ న్యూమరీ పోస్టుల్లో ఉద్యోగం పొదుతారు. తర్వాత ఆ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లు పోస్టులు ఖాళీ అయితే సూపర్ న్యూమరీ పోస్టు రద్దయి జూనియర్ అసిస్టెంట్ పోస్టులోకి వెళ్తారు.

మణిపూర్‌లో అల్లర్లను అరికట్టాలి



నల్లగొండలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

రామగిరి(నల్లగొండ) : మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను కేంద్ర ప్రభుత్వం కట్టడి చేయాలని నల్లగొండ పట్టణ క్రిస్టియన్ యూత్ సభ్యులు కోరారు. మణిపూర్‌లో జరుగుతున్న అరాచకాలకు నిరసనగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పెద్ద గడియారం చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను బట్టలు లేకుండా ఊరేగించి అత్యాచారం జరిపి హత్య చేసిన దుండగులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు భద్రత కల్పించడంతోపాటు శాంతి వాతావరణం నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో రొయ్య కిరణ్, దుబ్బ ప్రేమ్‌కుమార్, టి.ప్రవీణ్, దుబ్బ ప్రదీప్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు తీగల జాన్‌శాస్త్రి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేఖల భద్రాద్రి, పసల శౌరయ్య, కందుల విజయ్ కుమార్, రాజు, కందుల సందీప్, కిరణ్ కుమార్, ఉదయ్ కుమార్, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వంటావార్పు



తిప్పర్తిలో వంటావార్పు చేస్తున్న పంచాయతీ కార్మికులు

రామగిరి(నల్లగొండ): గ్రామ పంచాయతీ కార్మికులపై వేధింపులు అరికట్టాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతెపాక వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తిప్పర్తి, కనగల్, మాడ్గులపల్లి, నల్లగొండ మండలాల జీపీ కార్మికులు శుక్రవారం తిప్పర్తి ఎంపీడీఓ కార్యాలయం వద్ద వంటావార్పు, తిప్పర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నెం భిక్షం, కంచర్ల జానయ్య, చంద్రయ్య, ఎల్లేష్, సైదులు, యల్లయ్య, యాదగిరి, అనిల్‌కుమార్, నరేష్, శ్రీశైలం, శ్రీకాంత్, లింగమ్మ, నవనీత, భద్రయ్య పాల్గొన్నారు.

పంపిణీ ఘనంగా.. నివాసానికి దూరంగా

- డబుల్ బెడ్రూం ఇళ్లలో ఉండని లబ్ధిదారులు
- నిరుపయోగంగా దర్శనమిస్తున్న గృహాలు



హంక్యతండాలో లబ్ధిదారులు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లు

చందంపేట : ఇల్లు లేని వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్రూంల కోసం పేదల నుంచి భారీగా డిమాండ్ ఉంటుంది. అర్హులు ఎక్కువగా ఉండడంతో అధికారులు లబ్ధిదారులను లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తున్న విషయం తెలిసిందే. అంతటి ప్రాధాన్యం ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పొందిన వారు కొన్ని చోట్ల ఆయా ఇళ్లలో నివాసం ఉండడం లేదు. దీంతో చందంపేట మండలంలోని హంక్యతండాలో ఏడాది క్రితం పంపిణీ చేసిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పుడు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

రూ.1.26కోట్లతో 25 ఇళ్ల నిర్మాణం..

చందంపేట మండలంలోని హంక్యతండాలో రూ.1.26 కోట్లతో 25 నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను డ్రా పద్ధతిన ఎంపికైన వారికి గత సంవత్సరం కేటాయించారు. ఇళ్లను ప్రారంభించిన కొత్తలో కొన్ని రోజుల పాటు వాటిలో నివాసం ఉన్న లబ్ధిదారులు తర్వాత ఆ ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. కొందరు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లగా మరికొందరు గ్రామంలోనే ఉంటున్నారు.

భయంతోనా.. మరేదైనా కారణమా..

హంక్యతండాలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ సమయంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డాడు. డబుల్ బెడ్రూం ఇళ్లను కట్టేటప్పుడే ఇలా విద్యుత్ షాక్‌తో గ్రామానికి చెందిన వ్యక్తి మరణించాడనే భయంతోనా, లేక అశుభమనో.. మరేదైనా కారణం చేతనో లబ్ధిదారులు ఇళ్లకు దూరంగా ఉంటున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించి అందించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు లబ్ధిదారులు దూరంగా ఉండడం.. అధికారులు సైతం వారికి అవగాహన కల్పించకపోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఇల్లు ఉన్న వారికే కేటాయించారు



"గ్రామంలో ఇళ్లు ఉన్న వారికే డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించారనే విమర్శలు ఉన్నాయి. ఈ కారణం చేతనే లబ్ధిదారులు ఇళ్లకు దూరంగా ఉంటున్నారు. ప్రారంభించిన కొత్తలోనే కొన్ని రోజులు ఉన్న లబ్ధిదారులు మళ్లీ అటు వైపు చూడడం లేదు.

– కేతావత్ వెంకట్రాం, హంక్యతండా వాసి

ఐదెకరాలపైన ఉన్న వారికి..

రైతు 'బంధే'నా..!

- సకాలంలో అందని రైతుబంధు డబ్బు
- వానాకాలం సీజన్ పెట్టుబడి కోసం తప్పని ఎదురుచూపు
- రావాల్సిన మొత్తం రూ.130.29 కోట్లు



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుబంధు పథకం డబ్బులు రైతులకు సకాలంలో అందడం లేదు. ఇప్పటి వరకు ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులకే రైతుబంధు జమైంది. ఐదెకరాల పైన ఉన్న రైతులకు రైతుబంధు జమ చేసే విషయంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. దీంతో ఆ రైతులంతా డబ్బులు ఎప్పుడు జమవుతాయా అని ఎదురుచూస్తున్నారు. సీజన్ ఆరంభంలో విత్తనాల కొనుగోలు, దుక్కులు దున్నకం, ఎరువుల కొనుగోలు వంటి పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. సీజన్‌కు ఎకరానికి రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.10 వేలు రైతుల ఖాతాల్లో ప్రభుత్వ జమ చేస్తోంది. కానీ, గత యాసంగి సీజన్ నుంచి ప్రస్తుత వానాకాలం వరకు రైతుబంధు పథకం డబ్బులు సకాలంలో రైతుల ఖాతాల్లో జమకావడం లేదు. దీంతో రైతులు సాగు పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్నారు.

5,32,434 మంది రైతులు అర్హులు..

జిల్లా వ్యాప్తంగా రైతుబంధుకు 5,32,434 మంది రైతులు అర్హులు కాగా అందులో 5,09,020 మంది రైతులు తమ బ్యాంకు వివరాలను అప్‌డేట్ చేయించుకున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్ రైతుబంధు పథకం డబ్బులను జూన్ 26 నుంచి రైతుల ఖాతాల్లో వేయడం ప్రారంభమైంది. మొదటి రోజు ఎకరంలోపు వారికి, రెండవ రోజు రెండు ఎకరాల లోపు, మూడవ రోజు మూడు ఎకరాలలోలోపు భూమి ఉన్న రైతులకు ఇలా రోజువారీగా రంగారెడ్డి జిల్లా ట్రెజరీ నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. జూన్ నెలాఖరు వరకు 4,99,175 మంది రైతులకు సంబంధించిన డబ్బులు రూ.548,11,80,000 రైతుల ఖాతాల్లో జమచేయడానికి రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ అధికారులు రంగారెడ్డి జిల్లా ట్రెజరీకి పంపించారు. అందులో ఈ నెల 10వ తేదీ వరకు 4,51,469 మంది రైతులకు సంబంధించిన రూ.417,82,58,000 ఖాతాల్లో జమచేశారు. ఆ తర్వాత డబ్బుల జమ ప్రక్రియ నిలిచిపోయింది. జిల్లాలో ఇంకా 47,706 మంది రైతులకు సంబంధించిన రూ.130,29,22,000 రైతుల ఖాతాలో జమకావాల్సి ఉంది.

పెట్టుబడుల కోసం తంటాలు..

రైతుబంధు పథకం డబ్బులు ఖాతాల్లో జమకాకపోవడంతో రైతులు వానాకాలం పెట్టుబడుల కోసం నానా తంటాలు పడుతున్నారు. సీజన్ ఆరంభమై యాభై రోజులు గడవడంతో పాటు ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పొలాలు దున్నకం, వరినాట్లు వేసుకోవడం, ఎరువులు, కూలీలకు అవసరమైన డబ్బులు లేకపోవడంతో ప్రైవేట్ అప్పుల వారిని ఆశ్రయిస్తున్నారు. సకాలంలో ఖాతాల్లో జమచేస్తే ఉపయోగంగా ఉండేదని, అసలు జమ చేస్తారో లేదోనన్న ఆందోళనను కూడా రైతులు వ్యక్తం చేస్తున్నారు.

అప్పు చేసి సాగు పనులు చేయిస్తున్నా



"నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులు జమకాలేదు. సీజన్ వచ్చి యాభై రోజులు అవుతున్నా ఇప్పటికీ డబ్బులు వేయకపోతే పెట్టుబడులకు ఇబ్బంది అవుతోంది. అప్పులు చేసి సాగు పనులు చేపడుతున్నా.

– బోదనపు వెంకట్‌రెడ్డి, రైతు, జీకే అన్నారం, నల్లగొండ మండలం

రోజూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా



"వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులు పడలేదు. పెట్టుబడుల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నా. నాకు ఎనిమిది ఎకరాల భూమి ఉంది. దున్నకం, విత్తనాలు, ఎరువులు, కూలీలకు కూలి డబ్బుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. డబ్బులు పడ్డాయో లేదోనని ప్రతి రోజూ వ్యవసాయ, బ్యాంకు అధికారుల చుట్టూ తిరుగుతున్నా.

– అనుముల హనుమంత్‌రెడ్డి, రైతు, త్రిపురారం

క్లుప్తంగా

మూసీ ప్రాజెక్టు నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి : మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం భారీగా ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో అధికారులు ప్రాజెక్టు నాలుగు క్రస్టు గేట్లను పైకెత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. రిజర్వాయర్‌లో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా.. శుక్రవారం సాయంత్రానికి 642.10 అడుగుల నీరు ఉంది. ఎగువ ప్రాంతాల నుండి 4,052 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ఇంకా వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు ప్రాజెక్టులో నీటి నిల్వలను తక్కువగా ఉంచాలని నిర్ణయించారు. దీంతో శుక్రవారం ప్రాజెక్టు నాలుగు క్రస్టు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 4,962 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ఘనంగా తిరునక్షత్ర వేడుకలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక సేవపై అమ్మవారిని అధిష్టింపజేసి ముఖ మండపంలో ఊరేగించారు. అనంతరం సేవకు ముందు ఆచార్యలు, పారాయణీకులు దివ్యప్రబంధ పారాయణం పఠించి, సేవాకాలం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆచార్యులు, వేద పండితులు, పారాయణీకులు, అధికారులు పాల్గొన్నారు.

25న యాదాద్రీశుడి హుండీ లెక్కింపు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలును ఈ నెల 25వ తేదీన లెక్కించనున్నట్లు ఈఓ గీతారెడ్డి శుక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు. కొండ కింద గల సత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఉదయం 7గంటలకు లెక్కింపు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

● జల సవ్వడులు



సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో అలుగుపోస్తున్న గుండ్ల సింగారం కత్వ



మూసీ ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు



బీబీనగర్: మక్తా అనంతారం బ్రిడ్జిపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు



భువనగిరి మండలంలోని వడపర్తికత్వ వద్ద అలుగుపోస్తున్న రాచకాల్వ



భువనగిరి ఖిలాపై నుంచి జలపాతంలా జాలువారుతున్న వర్షపు నీరు



తిరుమలగిరి: అనంతారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు



భూదాన్‌పోచంపల్లి: జూలూరు-రుద్రవెల్లి గ్రామాల మధ్యన ప్రవహిస్తున్న మూసీ

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

మోత్కూరు: కురుస్తున్న భారీ వర్షాలతో యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామాల మధ్య గల మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మోత్కూరు బిక్కేరు వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

ఆటో నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం



చందాజి (ఫైల్)

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలో శుక్రవారం ప్రయాణిస్తున్న ఆటో నుంచి ఓ వ్యక్తి జారిపడి మృతి చెందాడు. పెద్దమునిగల్ గ్రామానికి చెందిన జమాల్‌పురి చందాజి(72) వ్యక్తిగత పనుల నిమిత్తం సోమవారం దేవరకొండకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో గుర్రపుతండా వద్ద ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారిపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

లారీ ఢీకొట్టడంతో..

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి వద్దగల బైపాస్ రోడ్డులో ఎస్సీ కాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మేళ్లచెరువుకు చెందిన చిన్నపంగు బాలరాజు (50) అనే వ్యక్తి మృతిచెందాడు. మఠంపల్లి ఎస్‌ఐ సీహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువుకు చెందిన బాలరాజు మిషన్‌భగీరథ పథకంలో పనిచేస్తున్నాడు. మేళ్లచెరువు నుంచి బైక్‌పై వ్యక్తిగత పనిమీద మఠంపల్లికి వస్తున్నాడు. మార్గమధ్యంలో చౌటపల్లి బైపాస్‌రోడ్డులోని ఎస్సీకాలనీ సమీపంలోకి రాగానే మఠంపల్లి నుంచి మేళ్లచెరువు వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న బాలరాజు వాహనంతో సహా రోడ్డు పక్కకు పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగు ఇళ్లలో చోరీ

● రూ.60వేల నగదు, 6 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



భాగ్యనగర్ కాలనీలో ఓ ఇంట్లో తెరిచిన ఉంచిన కబోర్డు డోర్స్

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలో దొంగలు వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. నగదుతో పాటు బంగారు ఆభరణాలను అపహరించారు. ఈ సంఘటన పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ముల్కూరు ఉపేందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లాడు. దీంతో ఇంట్లోకి దూరిన దొంగలు 6 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు తో పాటు రూ.50వేలు విలువ చేసే విదేశీ డాలర్లు చోరీ చేశారు. అదేవిధంగా నూకల భాస్కర్‌రెడ్డి ఇంట్లో చొరబడ్డారు. ఎంత వెతికినా ఏమీ దొరకకపోవడంతో పక్కనే ఉన్న గంగాధర్ ఇంట్లోకి వెళ్లారు. ఇంటి ఎదుట ఉన్న సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. అనంతరం పక్కనే ఉన్న సైదులు ఇంట్లోకి దూరి అక్కడా ఏం లభించకపోవడంతో వెళ్లిపోయారు. ఉదయం లేచి చూడగా చోరీ జరిగిందని గ్రహించిన సదరు బాధితులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. డీఎస్పీ పి.వెంకటగిరి, సీఐ నరసింహారావు అక్కడకు చేరుకుని ఇళ్లను పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

ఫిట్స్‌తో పొలంలో పడి రైతు మృతి



గంగదేవి శంకరయ్య(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: ఫిట్స్ రావడంతో ఓ రైతు పొలంలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని కప్రాయిపల్లి గ్రామంలో చోటు చేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు గంగదేవి శంకరయ్య(40) గ్రామశివారులో ఉన్న తన వ్యవసాయ పొలంలో కూలీలతో కలిసి వరి నాట్లు వేస్తున్నాడు. సాయంత్రం పొలం గట్టు వెంట నడుచుకొంటూ వెళ్తుండగా అదే సమయంలో మూర్ఛ(ఫిట్స్) రావడంతో పొలంలో బోర్లా పడిపోయాడు. ఆ సమయంలో కూలీలంతా నాట్ల పనిలో నిమగ్నం కావడంతో శంకరయ్యను ఎవరూ గమనించలేదు. ఎంతసేపటికీ భర్త రాకపోవడంతో భార్య లావణ్య అనుమానంతో కొద్దిదూరం వెళ్లి చూడగా శంకరయ్య పొలంలోని బురదలో ఊపిరాడక మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇటీవల ఒక కుమార్తె వివాహం చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



మృతుడు రోషయ్య

మునగాల(కోదాడ): మునగాల మండలంలోని ముకుందాపురంలో శుక్రవారం ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానిక ఏఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బయ్యా రోషయ్య(70)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండవ కుమారుడు ఉప్పలయ్య తన అత్తగారి ఇంటి నుంచి తిరిగి వచ్చేసరికి తండ్రి రోషయ్య ఇంటి ఎదుట వరండాలో మంచంపై పడుకొని ఉన్నాడు. ఎంత పిలిచినా లేవకపోవడంతో అనుమానం వచ్చి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడి రెండు చేతుల మీద, ఎడమ కణతపై చర్మం నల్లగా కమిలి ఉండడంతో రోషయ్య మృతిపై అనుమానం ఉందని ఉప్పలయ్య శుక్రవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ కారింగుల కృష్ణమూర్తి తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చిట్యాల: చిట్యాల పట్టణంలోని సంతోష్‌నగర్‌లో అక్రమంగా నిల్వ చేసిన ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం రాత్రి పట్టుకున్నట్లు చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి శుక్రవారం తెలిపారు. సంతోష్‌నగర్‌కు చెందిన జంగిలి యాదయ్య కొంత కాలంగా రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి తన ఇంట్లో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు యాదయ్య ఇంట్లో తనిఖీ చేయగా.. నిల్వ చేసిన పది బస్తాల్లోని ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం దొరికినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని రాళ్లజనగాం గ్రామంలో కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన తెల్జీరి రమేష్ వ్యవసాయ బావి వద్ద ఉన్న మేకల షెడ్డులో గురువారం రాత్రి సమయంలో కుక్కలు దాడి చేసి నాలుగు మేకలను చంపివేసాయి. వీటి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని రమేష్ తెలిపాడు.

మద్యం మత్తులో ఇద్దరు కానిస్టేబుళ్ల హల్‌చల్

● శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి..

నేరేడుచర్ల: నేరేడుచర్లలో ఇద్దరు కానిస్టేబుళ్ల మద్యం మత్తులో హల్‌చల్ చేసిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నెల 19వ నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెంలో ఓ బెల్ట్‌షాపు నిర్వాహకుడికి, ఇద్దరు కానిస్టేబుళ్లకు గొడవ జరిగింది. అడ్డు చెప్పబోయిన మరో వ్యక్తిపై కానిస్టేబుళ్లు దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మద్యం తాగిన కానిస్టేబుళ్లు డబ్బుల విషయంలో ఘర్షణకు దిగారని, మద్యం తాగి డబ్బులు ఇవ్వకుండా గొడవ చేశారని, బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. వీరు ఇటీవల హెడ్ కానిస్టేబుల్ ట్రైనింగ్‌ను పూర్తి చేసుకున్నట్లు తెలిసింది.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడ్డ బాధితుడు

మోత్కూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామ సమీపంలోని ముత్యాలమ్మ గుడి చెరువు కట్ట కింద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన విజయ్‌రెడ్డి, నాగారం మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రులు బైక్‌లపై ఎదురెదురుగా వచ్చి పాటిమట్ల, ముత్యాలమ్మ గుడి వద్ద ఢీకొన్నారు. ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని చికిత్స కోసం మోత్కూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



ఏటీఎం మిషన్‌పై గ్యాస్ కట్టర్‌తో కోసిన గుర్తులు

చిట్యాల: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు పక్కన ఉన్న ఏటీఎంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. చిట్యాల ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని హైవేలో ఎస్‌బీఐ బ్యాంకు పక్కన ఏర్పాటు చేసిన ఏటీఎంలోకి గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. మిషన్ ఓపెన్ కాకపోవటంతో దొంగలు వారి ప్రయత్నాన్ని విరమించుకున్నారు. శుక్రవారం ఉదయం గుర్తించిన బ్యాంకు మేనేజర్ సత్తయ్య చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించేందుకుగా పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



మృతి చెందిన ధరావతు మధు



ముత్యాలు(ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట): విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటనలు సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకున్నాయి. చివ్వెంల మండల పరిధిలోని పాండ్యానాయక్ తండాకు చెందిన ధరావతు బాబు, సరుల చిన్న కుమారుడు ధరావతు మధు (22), మోదిన్‌పురం గ్రామ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలో ఉన్న తమ వ్యవసాయ పొలం వద్ద నారుమడికి నీళ్లు పెట్టేందుకు శుక్రవారం ఉదయం వెళ్లాడు. అక్కడే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరు తెగి కింద పడి ఉండగా.. గమనించని మధు దానిపై కాలు పెట్టడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన సమీపంలోని రైతులు మధును చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి బాబునాయక్ స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కొడవలికి విద్యుత్ వైరు తగిలి..

చౌటుప్పల్: చౌటుప్పల్ మండల పరిధిలోని మంధోళ్లగూడెం గ్రామానికి చెందిన యాట ముత్యాలు(55) చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నివాసం ఉంటూ లింగారెడ్డిగూడెం గ్రామంలో ఓ రైతుకు చెందిన కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లి బోరుబావి వద్ద ఉన్న గడ్డిని కొడవలితో కోస్తున్నాడు. ఈ క్రమంలో గడ్డిలో ఉన్న బోరుమోటారుకు వెళ్లే విద్యుత్ వైరుకు కొడవలి తగలడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని సమీపంలోనే ఉన్న రైతు లచ్చిరెడ్డి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు ఎస్సై దిలీప్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ




అమ్మవారికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవిశ్వక్సేన సన్నిధి ఎదుట అమ్మవారిని అధిష్టింపజేసి ఆరాధన చేపట్టి సేవను ఊరేగించారు. వర్షాలు కురుస్తుండడంతో లక్ష్మీదేవిని ఆలయ ముఖమండపంలోనూ ఊరేగించారు. ఇక ప్రధానాలంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వర్షం కారణంగా భక్తులు తక్కువ సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు బోసిపోయి కనిపించాయి.

బైండోవర్ అతిక్రమణ

● రూ.లక్ష బైండోవర్ రుసుము చెల్లించాలని తహసీల్దార్ ఆదేశం



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎస్‌ఐ

మిర్యాలగూడ అర్బన్: బైండోవర్ చేసిన వ్యక్తి తిరిగి మరోవ్యక్తిపై దాడికి పాల్పడగా అతడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సంఘటన శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికలు సమీపిస్తుండడంతో మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఇంజమూరి ఏడుకొండలును ఈ నెల 14న తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కాగా.. సదరు వ్యక్తి ఈ నెల 15న సాయిశంకర్ అనే వ్యక్తిపై దాడి చేయడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో అతడిని ఎస్‌ఐ శివతేజ్ తిరిగి రెండోసారి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఏడుకొండలుకు రూ.లక్ష బైండోవర్ రుసుము చెల్లించాలని తహసీల్దార్ అనిల్ నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లో ఈ రుసుము చెల్లించకుంటే ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.